

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్మీడియట్ ఫెయిల్ అభ్యర్థులకు ఐటిఐలలో ప్రవేశానికి సంబంధించి రెండో విడత అడ్మిషన్ల గడువును పెంచారని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో iti.ap.gov.in అను వెబ్‌సైట్‌లో ఈ నెల 20 రాత్రి 11:55 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 22న వెరిఫికేషన్ పక్రియ ఉంటుంన్నారు. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఐటిఐ కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్య గోదావర్రి

- పారిశ్రామిక వ్యర్థాలతో జలాలు కలుషితం
- పెరుగుతున్న ప్రమాదకర బ్యాక్టీరియా
- నీటిని నేరుగా తాగితే రోగాలే....
- యథేచ్ఛగా తీర ప్రాంతం ఆక్రమణ



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కాలుష్య కోరల్లో చిక్కుకుని జీవనది విలవిల్లాడుతోంది. దక్షిణ భారత దేశ గంగగానదిగా పేరు గాంచిన గోదావరి జుల్లై, ఆగస్టు నెలలు మినహా మిగిలిన 10 నెలల పాటు మురికి కూపంగా దర్శనమిస్తోంది. పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజీల మురుగు, ప్లాస్టిక్ వస్తువులు, చెత్త ఇవన్నీ గోదావరిలోకే కలవడంతో జీవనది ప్రాసస్వం మసకబారుతోంది. వీటన్నింటికీ తోడు ఆక్రమణలతో గోదావరి తీరం కుచించుకుపోతోంది.

జిల్లాలో సీతానగరం మండలం గూటాల నుంచి పెరవలి మండలం మల్లేశ్వరం వరకూ 65 కిలో మీటర్లు మేర గోదావరి ప్రవహిస్తోంది. రాజమహేంద్రవరం నగరం నుంచి నిత్యం 60 ఎంఎల్‌డి మురుగు నీరు విడుదలవుతోంది. అదే విధంగా ఇతర మున్సిపాలిటీలు, పంచాయతీలు సైతం తామేమి తీసిపోము అన్నట్లుగా మురుగునీటిని నదిలోకి విడుదల చేస్తున్నాయి. మురుగునీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా చేరుతున్నాయి. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి గత పుష్కరాలకు పరీక్షలు నిర్వహించిన విషయం విధితమే. పది రెట్లు నీటి కాలుష్యం ఉందని నిర్ధారించారు. ఆ నీటిలో స్నానం చేస్తే చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని హెచ్చరించారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు ఆవ ఛానల్ వద్ద 50 ఎంఎల్‌డి నిర్మాణం చేప1ట్టారు. అయితే పర్యవేక్షణ కొరవడటంతో ఇది పూర్తిస్థాయిలో ఉపయోగ పడట్లేదు. దీన్ని వాడుకలోకి తీసుకురాకుండానే మరో ఎస్‌టిపి ప్లాంటుకు పూనుకున్నారు. నవామి గోదావరి ప్రాజెక్టులో భాగంగా మురుగు నీటి శుద్ధికి తొలి విడతగా రూ.80 కోట్లతో ఎస్‌టిపీ ప్లాంటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధుల లేమి కారణంగా కొంతకాలంగా నత్తనడకన సాగిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉంది.

గోదావరి తీరం ఆక్రమణలకు కేంద్రంగా మారింది. కోటిలింగాల రేవు, కాతేరు పుష్కర ఘాట్, వద్ద భూమిని ఆక్రమించేస్తున్నారు. ఇరిగేషన్ స్థలాలను లీజుల పేరుతోనూ అలాగే గట్టుపై ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలతో ఆక్రమించేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నదీ తీరానికి 500 మీటర్ల దూరంలో ఎటువంటి శాశ్వత కట్టడాలకు అనుమతి లేదు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలో బహుళ అంతస్తులతో పలు హోటళ్లు దశాబ్దాల కాలంగా ఉన్నాయి. అదే విధంగా ఆధ్యాత్మిక మందిరాల పేరుతో తీరం వెంట పదుల సంఖ్యలో శాశ్వత నిర్మాణాలున్నాయి. మరి కొన్ని కబ్జా చేసి వ్యాపార కేంద్రాలుగా లీజు కింద కేటాయించి ఆదాయం పొందుతున్నారు. కాతేరులోని ఓ ప్రముఖ పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు నదిలో కలసి పోతున్నాయి. సదరు పరిశ్రమలకు పలు మార్లు నోటీసులు జారీ చేసినా ఎటువంటి మార్పులేదు. అదే విధంగా తీరం వెంట సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు సుమారు 15కి పైగా ఉంటాయని అంచనా. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పరిశ్రమల్లో వినియోగించిన నీటిని శుద్ధిచేశాకే నదిలోకి వదలాలి. ప్రస్తుత పరిస్థితులలో గట్టును ఆధారం చేసుకుని సమీపంలో పరిశ్రమలు నెలకొల్పడం పరిపాటిగా మారింది.

నేరుగా తాగితే రోగాలే..

బిఐఎస్ ప్రమాణాల ప్రకారం తాగే నీటిలో ఫీకల్ కోలీఫామ్ ఆనవాళ్లు ఉండకూడదు. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా. కాని గోదావరి జలాల్లో ఫీకల్ కోలీఫామ్ మిల్లీమీటరుకు మూడు నుంచి నాలుగు వరకూ ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది. ఇక టోటల్ కోలీఫామ్ లీటర్ నీటిలో 50 లోపు ఉండొచ్చు. గోదావరి జలాల్లో మాత్రం లీటర్ నీటిలో 64 నుంచి 120 వరకూ బ్యాక్టీరియాలు ఉన్నట్లు తేలింది. బిఐఎఫ్ ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో ఘన వ్యర్థాలు(టిడిఎస్) 0.5 గ్రాములు కలిసి ఉన్నప్పటికీ ఆ నీటిని తాగొచ్చు. గోదావరి జలాల్లో లీటర్ నీటిలో 24 నుంచి 31 గ్రాముల మేర ఘన వ్యర్థాలు కరిగినట్టు వెల్లడైంది. ఈ జలాలను శుద్ధి చేయకుండా తాగితే కలరా, మలేరియా వంటి వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బిఐఎస్ ప్రమాణాలు ఇవీ...

1.పిహెచ్ 6.5 నుంచి 8.5లోపు ఉండొచ్చు
2 డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డిఒ) లీటర్ నీటిలో 6 మిల్లీ గ్రాములకంటే ఎక్కువ ఉండాలి
3. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(డిఒడి) లీటర్ నీటికి 2 మిల్లీ గ్రాములు ఉండొచ్చు.
4. టోటల్ కోలీఫామ్(బ్యాక్టీరియా) 100 మిల్లీ లీటర్ల నీటిలో 50 లోపు ఉండొచ్చు
5. ఫీకల్ కోలీఫామ్(ఎఫ్‌సి) ఇది ప్రమాదకర బ్యాక్టీరియా. ఇది 100 మిల్లీలీటర్ల నీటిలో ఒక్కటి కూడా ఉండకూడదు.
6. టిడిఎస్(టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్) లీటర్ నీటికి 500 మిల్లీ గ్రాములు లోపు ఉండొచు.



నిరసన తెలుపుతున్న మహిళలు

స్మార్ట్ మీటర్లు వద్దంటూ మహిళల ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలంటూ మంగళవారం స్థానిక చర్చిపేటలో సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విధానాల కారణంగా ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే గంట గంటకూ ఒక్కోరీతిన ఛార్జీ వసూలు చేస్తారన్నారు. ప్రజలపై పెను భారం మోపి అదానికి లాభం కలిగించేందుకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్నారన్నారు. విద్యుత్ రంగాన్ని అదానీ, కార్పొరేట్లకు కట్టబెడుతున్న పాలకులు తీరు మారాలన్నారు. స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలన్నారు. ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని ఎన్నికల సమయంలో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారన్నారు. ఇప్పుడు అధికార పగ్గాలు చేపట్టిన వారు రోజుకో రకంగా ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాలను కూటమి సర్కారు మోపిందన్నారు. నారా లోకేష్ నెల్లూరు జిల్లాలో యువ గళం యాత్రలో స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని రైతులు, యువకులకు పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉండగా అవే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారన్నారు. ఇది ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలలన్నారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, శానిటేషన్ పనులు విధిగా నిర్వహించాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ జి.రాజమనోహర్ సూచించారు. మంగళ వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని సభ్యులు ఏకరువుపెట్టారు. అధికంగా కరెంటు కోతలు విధిస్తున్నారని ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు.కొవ్వూరుపాడులో లోవోల్టేజ్ సమస్య ఉందన్నారు. సగ్గొండలో అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. చిట్యాలలో తాగునీటి ఎద్దడి సమస్య ఉందని బోరు ఏర్పాటు చేయాలని కోరారు. గోపాలపురం-దొండపూడి, తాళ్లపూడి , భీమోలు గ్రామాలకు బస్సు సర్వీస్ నిర్వహించాలన్నారు. అనంతరం సభను ఉద్దేశించి ఎంపిపి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు విధిగా శానిటేషన్ నిర్వహించాలని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పైపులైన్లకు లీకేజీలు అరికట్టాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బుద్ధ విహార్ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


ఉండ్రాజవరంలో బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మైత్రేయ బుద్ధ విహార్‌కు బిసివై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ రూ.2లక్షలను విరాళంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం బౌద్ధ ధమ్మ పీఠానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అనాలయో ద్వారా బుద్ధుని బోధనలు మరింత వ్యాప్తి చెందాలన్నారు. తద్వారా బహుజనులకు, వెనుకబడిన వారికి సమాజంలో సమాన గుర్తింపు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రామచంద్ర యాదవ్‌కు ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు. రామచంద్ర యాదవ్ తొలుత పీఠం ఆవరణలో మొక్క నాటారు, అనంతరం బుద్ధుని విగ్రహం ఎదుట జ్యోతి ప్రజ్వలన చేశారు. పీఠాధిపతి రామచంద్ర యాదవ్ చేతికి రక్షాబంధన్ కట్టి, ఆశీస్సులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కెవి మల్లేశ్వరం ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్‌నిశ్చల్ తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కె.వి ఖండవల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మల్లేశ్వరం, ఖండవల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వారు తెలిపారు

కార్టూ'నిజం'



పెను సవాళ్ల మధ్య ప్రపంచం

దౌత్యవేత్త డాక్టర్ బాలభాస్కర్

ప్రజాశక్తి - రాజానగరం

ప్రపంచం చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందని, సాంకేతిక విఘాతం, సోషల్, పొలిటికల్, డిప్లమేటిక్ ఛాలెంజెస్, ఎనర్జీ సెక్యూరిటీ, ఫుడ్ సెక్యూరిటీ వంటి సవాళ్లను ఎదుర్కొటుందని ప్రముఖ దౌత్యవేత్త డాక్టర్ బి.బాలభాస్కర్ అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్లో భారతీయ దృక్పథంలో విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాల భౌగోళిక శాస్త్రాన్ని నావిగేట్ చేయడం అనే అంశంపై సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా విసి ప్రసన్నశ్రీ, దౌత్యవేత్త డాక్టర్ బి.బాలభాస్కర్ హాజరయ్యారు. విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అకడమిక్ పండుగ జరుగుతుందన్నారు. ఒక పక్క క్వాంటం టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మరో పక్క ప్రపంచ దేశాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక పరిస్థితులు సవాళ్లపై అవగాహన సదస్సును నిర్వహించామన్నారు. ఈ సెమినార్‌కు బాలభాస్కర్ హాజరు కావడం విశేషమన్నారు. దౌత్యవేత్తగా భాస్కర్ అమెరికా, చైనాతో సహా 70కి పైగా దేశాలతో భారతదేశ సంబంధాలను నిర్వహించారని తెలిపారు. నార్వేలో భారత రాయబారి, బీజింగ్‌లో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మరియు వాషింగ్టన్ డిసిలోని భారత రాయబార కార్యాలయంలో మంత్రి వంటి కీలక పదవులను నిర్వహించారని చెప్పారు. దేశాల మధ్య సమస్యలను పరిష్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. దౌత్యవేత్త డాక్టర్ బి.బాలభాస్కర్ మాట్లాడుతూ ప్రపంచం ఎన్నో సమస్యలతో సతమతం అవుతుందన్నారు. ముఖ్యంగా టెక్నాలజీలో జరిగే తీవ్రమైన మార్పుల వల్ల సమాజంలో, పరిశ్రమలో ఆర్థిక మోడల్స్, ట్రెడ్ మోడల్స్, టారీఫ్ స్పేక్చర్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని ముందుగా గ్రహించకపోతే దేశాలు పెను సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. సాంకేతికపరంగా ప్రపంచ దేశాల్లో జరుగుతున్న మార్పులపై విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, నిపుణులు దృష్టి సారించాలనే ఉద్దేశంతో విశ్వవిద్యాలయం చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కోవిడ్ వంటి విపత్కరమైన పరిస్థితుల్లో భారత ధాన్యాగారం విలువ ప్రపంచానికి తెలిసిందన్నారు. అన్ని రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యావ్యవస్థలో ఉన్న అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా సంబంధిత సబ్జెక్టులో అప్ డేట్ అవ్వాలన్నారు. ఎర్త్ నుంచి స్పేస్ వరకు అన్ని రంగాల్లో క్వాంటం టెక్నాలజీ ప్రభావం చూపిస్తుందన్నారు. దానిపై పట్టు సాధించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు శ్రమను గౌరవిస్తాయని, డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను భారతదేశం అలవర్చుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ బాల భాస్కర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.వి.పెర్సిస్, డా.పి.సురేష్ వర్మ, డా.బి.జగన్మోహనరెడ్డి, డా.కె.రమణేశ్వరి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బాలభాస్కర్‌ను సత్కరిస్తున్న విసి ప్రసన్నశ్రీ తదితరులు

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : ఎస్ఇ

ప్రజాశక్తి-గోకవరం

పురుషోత్తపట్నం సత్యసాయి తాగునీటి ఎత్తిపోతల పథకం కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎం.రామకృష్ణ సోమవారం తెలిపారు. దేవీపట్నం, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 64 గ్రామాలకు సత్యసాయి తాగునీరు అందుతుంది. కార్మికుల సమ్మెతో పథకం సేవలు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల నుంచి తాగునీరు సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. దేవీపట్నం మండలంలో 18 గ్రామాలకు 15 గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరించామని ఎస్ఇ తెలిపారు. గత ప్రభుత్వంలో 18 నెలలు కార్మికులకు బకాయిలు ఉన్నాయని, కూటమి వచ్చిన తర్వాత రెండు నెలలు వేతనాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది జూన్లో రూ.5 కోట్లు బడ్జెట్లో కేటాయించారని ప్రతి మూడు నెలలకు రూ.కోటి చొప్పున నిధులు వచ్చేలా ఏర్పాట్లు చేశారని తెలిపారు.

ప్రక్కిలంక ఎస్‌బిఐ బిఎమ్‌గా రాజు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా బి.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవరపల్లి ఎస్‌బిఐ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి శాఖగా ఉన్న ప్రక్కిలంక బ్రాంచ్ పరిధిలో రైతులకు బ్యాంకు పరంగా సేవలు అందిస్తానన్నారు. ఇంతవరకు ప్రక్కిలంక మేనేజర్‌గా ఇక్కడ వెంకటయ్య పనిచేశారు. ఆయన బదిలీ అవ్వడంతో రాజు ఆయన స్థానంలో వచ్చారు.

పొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు

ఆర్‌ఒబి పనుల పరిశీలనలో కలెక్టర్

ప్రజాశక్తి-నిడదవోలు

పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో పొలాలు ముంపునకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం నిడదవోలులో ఆర్‌ఒబి పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆర్‌ఒబి పనుల నేపథ్యంలో రైతుల అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కార మార్గం చూపాలన్నారు. నిర్మాణ పనులు వల్ల దారవరం గ్రామంలో పొలాలు ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖను కోరామన్నారు. ఈ వంతెన నిర్మాణం వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందనేది అపోహ అన్నారు. రైతులకు మేలు చేసే క్రమంలో భూ సమతుల్యత, ఎత్తు పల్లాలను గుర్తించి, తగిన నివేదిక అందించాలని ఆదేశించారు. ఎర్ర కాలువకు వరద వస్తే ముంపు ప్రమాదం నేపథ్యంలో పరిష్కారం కోసం అధికారులిచ్చే సూచనలను అనుసరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణుల బృందం, ఆర్‌డిఒ, రైల్వే ఇంజినీరు , ఇరిగేషన్ ఎస్ఇ, జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి మరోసారి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాల్సి ఉందన్నారు. ఆర్‌ఒబి వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో రైతుల పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఆర్ అండ్ బి ఇఇ రూప్‌కుమార్, డిఇ బి.వెంకటరమణ, నిడదవోలు తహశీల్దార్ బి.నాగరాజునాయక్, చాగల్లు తహశీల్దార్ ఎం.మెరికమ్మ తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ పి.ప్రశాంతి సోమవారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముగ్గురిలో ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. సీనియర్ల వద్ద పనిలో మెళకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదేవిధంగా అంకితభావంతో అప్పగించిన విధులు నిర్వర్తించి, తాము పనిచేస్తున్న శాఖల అధికారుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఆఫీస్ మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కష్ట పడి చదివితేనే సక్సెస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కష్ట పడి చదివితేనే తగిన ఫలితం, సక్సెస్ దక్కుతుందని సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తమ్మా రవి అన్నారు. బొమ్మూరులోని జిపిఆర్ జెడ్‌పిపి హైస్కూల్లో స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను మంగళవారం సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తమ్మా రవి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంరక్షణ శాఖ సంక్షేమ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. స్టూడెంట్స్ ముందు నుంచి కష్టపడితే సక్సెస్ ఉంటుందని, ప్రతి స్టూడెంట్ తప్పనిసరిగా సక్సెస్‌ని రుచి చూడాలని సూచించారు. కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు కెరీర్ ప్లానింగ్, అమలు, ఎలా సమన్వయం చేసుకోవాలో వివరించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ బి.నర్సారెడ్డి మాట్లాడుతూ చదువును సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇబ్బందులను అధిగమించి మంచి కెరీర్‌ని నిర్మించుకోవాలని సూచించారు. స్కూల్ హెడ్మాస్టర్ నరసింహారెడ్డి, తెలుగు మాస్టర్ స్వామి మాట్లాడుతూ సత్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం కెరియర్ గైడెన్స్ క్లాసెస్ ఇచ్చిన వక్తలను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సత్య చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ, ఉపాధ్యాయుల శ్రీరామమూర్తి, అసిస్టెంట్ సెక్రటరీ ఎంవిఆర్ఎస్.శాస్త్రి, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం కన్వీనర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నర్సారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శ్రీనివాసరావు, సలహాదారులు కె.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

ఘనంగా బూరుగుపల్లి శేషారావు పుట్టినరోజు

ప్రజాశక్తి - నిడదవోలు



పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు పుట్టిన రోజును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, శేషారావు సోదరులు బూరుగుపల్లి శ్రీనివాసరావు హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరావు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రంగా రమేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు ప్రమోద్, టిడిపి మండల అధ్యక్షులు వెలగన సూర్యారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనున్నారు.

వ్యాధుల సర్వే సంతృప్తికరం

ప్రజాశక్తి-కడియం

ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు, కడియం పిహెచ్‌సికి సంబంధించిన వేమగిరి సచివాలయం-3 పరిధిలో గతంలో జరిగిన అసంక్రమిక వ్యాధుల సర్వే3.0లో నాణ్యతను అంచనా వేయడంలో భాగంగా, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగ సిబ్బంది మంగళవారం వేమగిరి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని ఇళ్లను ఎంపిక చేసి సర్వే నిర్వహించినట్లు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఈ సర్వే మన జిల్లాలో ఐదు గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ వివి.దుర్గాప్రసాద్, డాక్టర్ కెవి.ఫణిమాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి.సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్రబాబు, డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రశాంత్‌కుమార్, సీనియర్ రెసిడెంట్స్, ట్యూటర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.శ్రీనివాస్, కడియం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మణిజ్యోత్స్న, విల్సన్ పాల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రయివేటు బస్సు ఢీకొని మంగళవారం వ్యక్తి మృతి చెందగా మరొకనికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ కెవి.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధి గోపాలపురం అగ్రికల్చర్ చెక్ పోస్ట్ వద్దఅదే గ్రామానికి చెందిన అవిడి సత్తిపండు(51) అతని స్నేహితుడు అత్తిలి యేసుబాబు పని ముగించుకుని మోటార్‌సైకిల్ ఇంటికి వస్తున్నారు. వెనుక వస్తున్న ప్రయివేటు టూరిస్ట్ బస్సు ఢీ కొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా అప్పటికే సత్తిపండు చనిపోయినట్లు తెలిపారు. మరొక వ్యకి యేసు బాబుకు గాయాలయ్యాయి. ఇతనిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. దీనిపై సత్తిపండు కుమారుడు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి లారీ సీజ్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం నారా లంక గ్రామంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం నారాయణలంకలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న లారీని కేదాలంక, కపిలేశ్వరపురం, గ్రామ రెవెన్యూ అధికారులు టి వెంకటేశ్వరరావు, ఎస్ సత్యనారాయణ, అంగర ఏ ఐ ఎస్ ఆర్ సత్య నారాయణ పట్టుకుని సీజ్ చేసి అంగర పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

అంతరాష్ట్ర స్థాయిలో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ ఎ.కృష్ణభగవాన్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. సామర్లకోట కొత్త వంతెన వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను కంచర్ల మోహన్‌రావు అలియాస్ మోహన్ అనే అంతర్ జిల్లాల దొంగగా గుర్తించామని తెలిపారు. అతని వద్ద నుంచి ఇప్పటికే జరిగిన నాలుగు దొంగతనాలకు సంబంధించిన సుమారు 50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండిని రికవరీ చేశామన్నారు. అనంతరం మోహన్‌ను కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించేందుకు ప్రజలు ఇంటి నుంచి బయలుదేరే ముందు సమీప పోలీస్‌స్టేషన్‌కి గాని, పొరుగువారికి గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటిని సురక్షితంగా లాక్ చేయాలని సూచించారు. పోలీసు శాఖ అందజేస్తున్న లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు వెంటనే పోలీస్ కంట్రోల్ రూం లేదా సమీప స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిందుతుడిని అరెస్టు చేయడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్‌బాబు, ఇతర సిబ్బందిని అభినందించారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, సేవిస్తున్న ఐదుగురుని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ జి.శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి గొల్లప్రోలు శివారు నల్లం వారి లేఔట్‌లో దాడి చేయగా 4 కేజీల గంజాయిని, నలుగురు వ్యక్తులతోపాటు, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తమ విచారణలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన మడ్డు లోకేష్ నల్లం వారి లేఅవుట్ వద్దకు గంజాయిని తెచ్చాడు. ఆ ప్రదేశంలో కాకినాడ రేచర్ల పేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్, పిఠాపురం మంగమ్మరావు పేటకు చెందిన దానాల మనోహర్, యు.కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన రామిశెట్టి దుర్గాప్రసాద్‌లతోపాటు, ఒక మైనర్ కలిసి కొంత గంజాయిని వారు వాడుకోవడానికి తీసుకుని, మిగిలిన గంజాయిని విక్రయించేందుకు సమానంగా పంచుకుంటుండగా వీరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


వీర నాగవల్లి, పద్మప్రియ (ఫైల్ ఫొటోలు)

అక్కా, చెల్లి అదృశ్యం

ప్రజాశక్తి-కడియం

కడియం గ్రామానికి చెందిన అక్కచెల్లెళ్ళు పంద్రిల్ల వీరనాగవల్లి(17), పంద్రిల్ల పద్మ ప్రియ(16) మంగళవారం ఉదయం కడియంలో ఆంజనేయ స్వామి ఆలయానికి వెళతామని ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి అయినా తిరిగి రాలేదని, వారి తండ్రి పంద్రిల్ల వెంకన్న కడియం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బయటకు వెళ్లేటప్పుడు పంజాబీ డ్రెస్సులు ధరించి ఉన్నారని, సెల్ ఫోన్ తీసుకు వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరి ఆచూకీ తెలిసినవారు కడియం పోలీస్ స్టేషన్ 9440796587, 9347705890 నెంబర్లకు తెలియజేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోరారు.

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-గోకవరం



గోకవరం సంత మార్కెట్‌కు చెందిన కారకుదిటి బాలు(14) అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడు గోకవరం సంత మార్కెట్ ప్రాంతంలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆచూకీ తెలిసినవారు, 8522062114, 9866737300 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నాణ్యమైన పొగాకుకే గిట్టుబాటు ధర

గుంటూరు పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి - గోపాలపురం


పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, అధికారులు

నాణ్యమైన పొగాకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉందని, ఈ డిమాండ్ ఆధారంగానే మంచి ధర లభిస్తుందని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్ అన్నారు. మంగళవారం గోపాలపురం టుబాకో బోర్డు వేలం కేంద్రంలో 91వ రోజుకు పొగాకు కొనుగోలు ప్రక్రియ జరిగింది. దీనిపై గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. స్వయంగా కొనుగోలు ప్రక్రియలో పాల్గొన్ని పొగాకు నాణ్యత పరిశీలించారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రైతులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడారు. బోర్డు సూచించిన పరిమితి మేరకే మాత్రమే పొగాకు సాగు చేయాలన్నారు. మిగులు భూముల్లో అంతర పంటలు వేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లో పొగాకు కొరతకు డిమాండ్ ఏర్పడుతుందన్నారు. డిమాం డుకు, నాణ్యతను బట్టే ధర నిర్ణయిస్తారన్నారు. పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభంలో ఏడు కంపెనీలు మాత్రమే పాల్గొని కొనుగోలు జరిపారని ప్రారంభంలో అత్యధిక ధర రూ.290 లభించిందన్నారు. రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. అయితే అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యమైన పొగాకుకు డిమాండ్ ఏర్పడడంతో అంతర్జాతీయ వాణిజ్య శాఖ నుంచి అనుమతులు రావడంతో కంపెనీలకు ఆర్డర్లు అధికంగా రావడంతో జులై ప్రారంభం నుంచి 30 కంపెనీలు కొనుగోళ్లకు రావడంతో ప్రస్తుతం అత్యధిక ధర రూ.359కి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. రైతులు బోర్డు అనుమతికి మేరకు పొగాకు పండించాలని అన్నారు.అదనంగా ఉత్పత్తి చేసిన పంటకు పెనాల్టీ విధించబడుతుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కషి చేస్తానని తెలిపారు. అనంతరం గోపాలపురం టుబాకో బోర్డు వేలం నిర్వహణ అధికారి కేవల్ రామ్ మీనా మాట్లాడుతూ గోపాలపురం టొబాకో బోర్డు పరిధిలో 2246 మంది రైతులు ఉన్నారన్నారు. 2746 రిజిస్ట్రేషన్ బేరన్‌లు ఉన్నట్లు తెలిపారు. దీనీ కోసం 4,800 హెక్టార్లు పంట సాగుచేసేందుకు అనుమతులు లభించగా రైతులు 5122 హెక్టర్లలో పంట సాగు చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి 12 మిలియన్ల కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతి లభించగా రైతులు 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికీ 5.9 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టొబాకో బోర్డురైతు సంఘ అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, పి.జగదీష్, వి.రమేష్, కె.అన్నవరం, ఎస్.సత్యనారాయణ, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.



మహిళను రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి- కొవ్వూరు

రోడ్ కం రైల్వే వంతెన పైనుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చిలకలపూడి నాగమణి అనే మహిళను సకాలంలో గుర్తించిన పోలీసులు జాలర్ల సాయంతో రక్షించారు. మంగళవారం తెల్లవారు జాము సమయంలో ఆమె వంతెన దిగువ భాగంలో ఉన్న రైలు బ్రిడ్జి పైకి వెళ్ళింది. అక్కడే ఐరన్ పోల్‌పై కొద్దిసేపు కూర్చుంది. రైల్వే ఫూట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆమెను గుర్తించారు. ఆమెను ప్రశ్నించగా అకస్మికంగా నదిలో దూకేసింది. దీంతో అక్కడే ఉన్న జాలర్ల సాయంతో పోలీసులు ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రాథమిక చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్‌డిఒ రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆమెను పరామర్శించారు.

పల్లెల అభివృద్ధి టిడిపికే సాధ్యం

ప్రజాశక్తి-నల్లజర్ల


బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు

పల్లెలు అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పడమటి చోడవరం, తూర్పు చోడవరం, గుండేపల్లి, తెలికిచెర్ల. గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేశారు. తూర్పు చోడవరంలో వృద్ధ మహిళలు కొంతమంది ఆయన వద్దకు వచ్చి తమకు పెన్షన్లు రావట్లేదని, మరి కొంతమంది ఉపాధి హామీ పథకం పనులు నిలిపేశారని తెలిపారు. అనంతరం చోడవరం నుంచి గుండేపల్లికి రూ.1.80 కోట్లతో నిర్మించే బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తెలికిచెర్లలో వాకాల అంజి ఆధ్వర్యంలో గజమాలతో ఎంఎల్ఎను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, మాజీ ఎంపిపి జమ్ముల వీరవెంకటసతీష్, పెండ్యాల చందు, హిమబిందు, మాజీ సర్పంచ్ వీరమళ్ల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌లో దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆప్కో మెగా సేల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆషాడం, శ్రావణ మాసం సందర్భంగా ఆప్కో మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌ను లాలాచెరువు ఆప్కో విక్రయ కేంద్రంలో మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల్లో ఒకటైన చేనేత వస్త్రాలను తయారు చేయడం ద్వారా అనేకమంది చేనేత కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించి చేనేత అభివృద్ధికి పాటుపడాలన్నారు. చేనేత ఉత్పత్తులైన చీరలు, టవల్స్, దుప్పట్లు, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేసి తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. చేనేత వస్త్రాలు ఎంతో మదువుగా ఉంటాయని శరీరానికి హాయిని కలిగించడమే కాక ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. చేనేత వస్త్రాల ప్రత్యేక ఎగ్జిబిషన్ స్టాల్స్ ప్రారంభించిన అనంతరం చేనేత వస్త్రాలను ఆమె పరిశీలించారు. ఈ చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్‌లో రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ దొరుకుతాయన్నారు. ఎంపిక చేసిన వస్త్రాలపై 30 శాతం నుంచి 67శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి

ప్రజాశక్తి- తాళ్లపూడి

స్త్రీల అభ్యున్నతి కోసం కషి చేస్తూ ఆంధ్ర మహిళ పత్రిక నెలకొల్పి మహిళా సభను స్థాపించడంతో పాటు మహిళలకు ఎన్నో సౌకర్యాలు అందించిన స్వాతంత్ర సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితాన్ని నేటి విద్యార్థులకు ఆదర్శంగా తీసుకోవాలని పైడిమెట్ట ఎంపిపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు, తాళ్లపూడి శ్రీవిజేత హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం దుర్గాబాయి జయంతిని పాఠశాలలో నిర్వహించారు. దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది విజయకుమారి, ఆశా వర్కర్ వసంత, ఉపాధ్యాయులు నిప్పీ, సాయి లత, కరిష్మా, వెంకట రాజు ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - చాగల్లు

ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం వచ్చినా ఎండలు మండుతున్నాయి. వాతావరణ మార్పులతో తీవ్ర గుబులు రేపుతోంది. ఉక్కబోతతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్‌కోతలతో సతమతమవుతున్నారు. వేడి, ఉక్కపోత వల్ల చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. జులై నెలలో ఇలాంటి ఎండలు ఎప్పుడూ చూడలేదని వృద్ధులు చెబుతున్నారు. కాంక్రీట్ జంగిల్ కారణంగా మొక్కలను నరికేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. మొక్కలను విరివిగా నాటాలని వారు సూచిస్తున్నారు. మరోపక్కల వర్షాలు ముఖం చాటేయడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే పంటలు నారుమళ్లు, నాట్లు దశలో ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలు ముఖం చాటేస్తే నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీతపల్లివాగు అనుసంధానంతో పూర్తిగా సాగునీరు

ప్రజాశక్తి-గోకవరం


సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

సూరంపాలెం ప్రాజెక్ట్ రైతాంగానికి నీరు సంవృద్ధిగా అందాలంటే సీతపల్లి వాగును సూరంపాలెం రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూఅన్నారు. మంగళవారం సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము ఆధ్వర్యంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. రంపచోడవరం ఎంఎల్ఎ మిరియాల శిరీషదేవితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ సూరంపాలెం ప్రాజెక్టును భూపతిపాలెం ప్రాజెక్టును ఒకే ప్రాజెక్టుగా చేయాలన్నారు. రెండు ప్రాజెక్టులకు వేరువేరుగా ఉండటం వల్ల సూరంపాలెం ప్రాజెక్టుకు నీటి ఎద్దడి వస్తుందన్నారు. సూరంపాలెం ప్రాజెక్టు లోకి వచ్చే నీరు తక్కువగా ఉంటుందన్నారు. దీంతో పంటలకు పూర్తిగా నీరు అందడం లేదన్నారు. ఇటు భూపతి పాలెం ప్రాజెక్టును అటు సీతపల్లి వాగును సూరంపాలెం కి అనుసంధానం చేయాలని ఆయన అధికారులను కోరారు. రంపచోడవరం ఎంఎల్ఎ శిరీషా దేవితో కలిసి ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. గతంలోనే ఈ విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, గోకవరం క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి పిల్ల చంటిబాబు ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మల్లవరం గ్రామంలో మరపట్ల దొరబాబుకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.30,785 చెక్కును సోమవారం సాయంత్రం లబ్ధిదారునికి ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

నేడు దేవరపల్లి సెక్షన్ పరిధిలో 33/11 కెవి రామన్న పాలెం సబ్ స్టేషన్‌లో 11 కెవి రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డిడిఎస్ వర్క్ నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపి ఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ధుమంతన గూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుంటే జరిమానా తప్పదని ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. మంగళవారం పాలంగి, ప్రధాన రహదారిపై వాహనతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాపాయాలు కలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేమగిరి జడ్‌పిహెచ్‌ఎస్‌లో ల్యాబ్ ఆన్ వీల్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థుల బృందం వేమగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించింది. ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా భౌతికశాస్త్ర అధ్యాపకులు, పాఠశాల విద్యార్థులకు వివిధ ప్రయోగాలు వివరించారు. అంతేకాకుండా కొన్ని ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు. యాంత్రిక తరంగాల ప్రదర్శన, సౌరశక్తి ప్రయోగాలు, విద్యుత్ డైనమోతో యాంత్రిక శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడం వంటి ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో కళాశాల అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, డి.సంజీవ్‌కుమార్, బి.హరినాథ్, కె.భార్గవి, పి.పద్మావతి, జి.పద్మ పాల్గొన్నారు.

'సుపరి పాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో మంగళవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను, ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు,. గ్రామంలో పారిశుధ్యం, వీధిదీపాలు, మంచినీరు, డ్రెయిన్ల పూడికతీత పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బొల్లిన శివ నాగేంద్ర, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన ముళ్ళపూడి శారదకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అందించారు. రూ.70,104 విలువ చేసే చెక్కును గ్రామంలో లబ్ధిదారుని ఇంటివద్ద ఆయన అందించారు.

కరాటేలో నిడదవోలు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణానికి చెందిన షేక్ మీరా షరీఫ్, నస్రీన్ దంపతుల కుమార్తెలు సన హఫ్సిన్, నిషా హఫ్రీన్ ఓపెన్ కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ నెల 13, 14 తేదీల్లో అనకాపల్లిలోని సబ్బవరంలో జరిగిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో వీరు పాల్గొన్నారు. సన హఫ్సిన్ గోల్డ్ మెడల్ సాధించగా, నిసా హఫ్రీన్ బ్రాంజ్ మెడల్ సాధించింది. వీరు స్థానిక ఆదిత్య స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. వీరిని ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించింది.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంఎల్‌సి వీర్రాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్‌సి సోము వీర్రాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌పై వీర్రాజు ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అంశంలో గురువులతోపాటు తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేసి వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరపున చేస్తున్న కృషిని కొనయాడారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహవంతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా లక్ష్యాలను అందుకునేలా మరిన్ని కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆకాంక్షించారు.